# వెఱ్ఱి నాగన్న

[ కథానిక ]

## శ్రీ శివరాజు వెంకటసుబ్బారావు

["స్థాపితమైన అన్యాయంవల్ల ఆమోదింపబడిందే న్యాయం"—అనటోల్ ఫ్రాన్స్]

సాయంత్రం నాలుగింటికి మామూలు ప్రకారం చక్రాలబండితోసుకుంటూ, వీథమ్మట అమ్మకానికి బైలుదేరాడు నాగన్న. అది వొచ్చేపొయ్యే బళ్లతోనూ, కార్లతోనూ రద్దీగా వుండే బజార్లాంటి వీథి. అందులో అమ్మకాని కమర్చబడ్డ దుకాణా లుండడమేకాకుండా, కొనుక్కునే వాళ్లు కాపరంవున్న ఇళ్లుకూడా వున్నాయి.

"పటకాలు, జోళ్లు, టోపీలు, కర్ర సామాన్లు, చైనాబొమ్మలు..." అని పాడు కుంటూ, నాగన్న రోడ్లమీద నడిచేవాళ్లనీ, అరుగులమీద కూలపడ్డవాళ్లనీ ఎరుగున్న వాడవడంవల్ల వాళ్లకేసి తల పంకిస్తూ, "ఏవన్నా కొంటారా" అనే ప్రశ్నార్థకమైన చూపులు చూస్తూ నడవడం మొదలెట్టాడు. నాగన్న పాట నిత్యమూ పటకాలతో ప్రారంభ మవుతుంది. మిగతా వస్తువులు వొకటి రెండుమాత్రం ఆకర్షణకోసం వుంచి, వాటిని గురించి తగ్గుకంఠంలో చివ్వర పాడతాడు. ఆపాటలో అప్పుడప్పుడు అతనిదగ్గర లేని సామానుల తాలూకు నామాలుకూడా వినిపిస్తాయి.

"పటకాలు, జోళ్లు, టోపీలు, చైనా బొమ్మలు, జర్మనీసామాన్లూ..."

నేడు యూరపులో జరిగే మహాసంగ్రామాన్నిగురించి నాగన్న కేమీ తెలియదని చెప్పొచ్చు. జర్మనీసామాన్ల అమ్మకంలో అపారమైన ఆకర్షణశక్తు లున్నాయని మొద లే తెలియదు.

చైనా, జర్మనీలు నాగన్నదృష్టిలో తన పాటకు కొత్త లయ కల్పించాయి. మళ్లా మార్చి పాడాడు.

"జర్మనీసామాన్లు, చైనాబొమ్మలు, పట కాలు, జోళ్లు."

ఇంతలో ౧౮-వ నంబరు డాబాలోంచి టైపిస్టు జాన్ భార్య మేరీ పిల్లాడికి పటకాలు కొనడానికి బైటికొచ్చింది. బండిలోంచి వో పటకా చేత్తో తీసుకుని "ఎల్లా యిస్తావ్?" అంది.

"ఆరణాలు"

"ఇచ్చే మాట చెప్పు"

"మీా రెప్పుడేనా బేరమాడారా? ఏదో బీదవాణ్ణి-యుద్ధంరోజులు..." అన్నాడు నాగన్న, అప్రయత్నంగా దృష్టిని ౮౯-న నంబరు పోలీసువైపు మరలుస్తూ. ౮౯-వ నంబరుపోలీసు లారీ, రిక్షాల వెనకాల మాయ మయ్యాడు.

"ఉండు, సైజు సరిపోతుందేమో చూసి వొస్తా" అని మేరీ పటకాతో లోపలి కెళ్లింది.

నాగన్న వెనకాలనుంచి "కదులు" అని వో శబ్దం వినిపించింది.

నలభైయేళ్లనుంచి నాగన్న చేసే పని కదలడమే! ఇంటినుంచి ఇంటికీ, వీథినుంచి వీథికీ, ఊరినుంచి వూరికీ కదలికదిలి, నాగన్న ముసలికాళ్లు కదుములు కట్టాయి. ఆశబ్దం దగ్గరికి సమీపించి మళ్లా "కదులు" అంది. నాగన్న వెనక్కి తిరిగిచూశాడు. ఆశబ్దానికి సృష్టికర్త ౪౯-వ నంబరుపోలీసు.

ఇంతలో మేరీ వొచ్చి సైజు కుదిరిందని, డబ్బుకోసం మళ్లీ లోపలి కెళ్లింది. చిరిగిన లాగూ ధరించిన వో ముసలాడు నాగన్న బండిని కుతూహలంగా పరీక్షించి "ఈపటకా యెంత?" అన్నాడు.

"ఇప్పుడే ఆవిడ అరణాలకి తీసుకుంది. ఇంకా నాలుగురోజుల్లో కొత్తరకాలు తీసుకొస్తా - మంచి చైనాబొమ్మలు, జర్మనీ సామాన్లు..."

నాగన్నభుజంపైన బరువైన హస్తం వాలింది. దాని యజమాని ౪౯-వ నంబరు పోలీసు.

"కదుల్తావా, కదలవా?" అన్నాడు శాంతిపోషకుడు.

"కదుల్తా, బాబుగారూ...ఆవిడ డబ్బులివ్వంగానే. కదల కేంజేస్తానూ..."

"కాదు, ముందు కదిలి మాట్లాడు. నడిరోడ్డుమీద నీకు అమ్మకం యేమిటి?"

"కోంపడకండి. ఇంకెప్పుడూ రా నిల్లా. మొన్నదినం అమ్ముకుంటి నీడ, ఆ పోలీసాయన యేమీ అనలేదు సరిగందా, పావలా పెట్టి పటకా కొన్నాడు."

"అవన్నీ అనవసరం. ముందు కదులు."

"డబ్బులు తీసుకోనీవయ్యా. నీకూడా కావాలంటే సవగ్గా యిత్తా"

"డబ్బుల్ గిబ్బుల్ జాంతానై. కదులు. ఇంకా యేమున్నాయ్, అమ్మకానికి?"

"మీ నోటంట సల్లంగా రావాల మాట. అల్లా అడగండి. భలే భలే చైనా బొమ్మలు, జర్మనీసామాన్లు..."

"ఏవీ చూపించు"

"ఏంటి?"

"అవే"

"అంటే?"

"అవే సామాన్లు" అన్నాడు ౪౯-వ నంబరుపోలీసు. 'జర్మనీ' అన్నపేరు ఉచ్చరించడానికి అర్హత లేదని పోలీసుకి తెలుసు. అతను ఆపేరు అనడంలో చూపిన అయిష్టాన్ని నాగన్న గుర్తించకపోలేదు. యుద్ధపు రోజుల్లో 'జర్మనీ' అనడంలో ప్రమాదం వుందని ౪౯-వ నంబరుపోలీసు పడ్డ బాధ వల్ల గ్రహించుకున్నాడు. అతని కింతటి గ్రాహ్యశక్తి నిచ్చింది పాండిత్యం కాదు; అది పామరత్వానికి సహజమైన మూఢదృష్టి.

"అవేనా ? అవేం లేవండి. ఇదిగో ఇది చూశారూ?" అని కంగారుపడుతూ, పోలీసుల కాకర్షణీయమైనవి తుపాకీలుకదా అనుకుని, బండిలోంచి పిల్లలు పేల్చుకునే తుపాకీని పైకి తీసి పోలీసుకి అర్పించుకున్నాడు.

పోలీసుసంశయం స్థిరపడింది. గూఢచారుడో, ద్రోహో—నాగన్న యీ రెండింటిలో యెవడో వొకడు. ౪౯-వ నంబరు పోలీసు ఆ పనిలోకి యుద్ధపు అవసరాన్ని బట్టి కొత్తగా ప్రవేశించాడు. అతను సోదా చేసి కనిపెట్టిన యీ నేరానికి గవర్నమెంటు అతని వుపకారాన్ని గుర్తించి ఆదరిస్తుంది. అంచేత "కదులు జైలుకి" అన్నాడు.

నాగన్నకి మతి చలించింది తాత్కాలికంగా.

"ఎందుకు?"

"ఈ తుపాకీ జర్మనీదేనా?"

"ఈ తుపాకీ జర్మనీది; యీ బండి జర్మనీది; నేను జర్మనీవాడిని ; నువ్వు జర్మనీవాడవు; మనమంతా జర్మనీవాళ్లం..." అంటూ రామదాసు జైలులోని వున్మాదంలా మొదలెట్టాడు నాగన్న.

౪౯-వ నంబరుపోలీసు నోటుబుక్కు పైకి తీసి,—

"నీ పేరు?"

"జర్మనీ... కాదు, వుండండి. ఆ, నాగన్న"

"పద జైలుకి"

"ఆగవయ్యా. పిచ్చాడిని పట్టుకు మహా దబాయిస్తున్నావేం? వాడి మొహం వాడికేం తెలుసు, యేదో అమ్ముకునేవాడు! ఆ మాటకొస్తే నీకుమట్టుకు యేం తెలుసు?" అన్నాడు ధీమాతో వొక మధ్యవర్తి. అప్పటికప్పుడే నాగన్న బండిచుట్టూ కేకలేస్తూ అమ్ముకునే ఎనమండుగురు పిల్లలు, పలుగురు ముసలాళ్లు, యిద్దరు ముష్టివాళ్లూ మూగి మొగతాళిగా చూస్తున్నారు యీ దృశ్యాన్ని. వీథిలో జరిగే నాటకం చూడడానికి అన్నిరకాల మానవులకూ సమానమైన సరదా, వుత్సాహం వుంటుంది. రోడ్డు మీద హత్య, డీకొట్టడం, మాటలపోటీ, కొట్లు తగలడడం, కారుకింద సైకిలు పడడం— వీట్లో యేది జరుగుతున్నా ధర్మాత్ములు యివ్వబోయ్యే పైసాలని సహితం ఒదులుకుని, చూడడానికి ముష్టివాళ్లు మొగబడతారు. ఇల్లాంటిఘట్టాలు లేకపోతే చాలామందికి కడుపునిండదు.

నాగన్ననిర్దోషిత్వాన్ని సమర్థించడాని కొచ్చిన మధ్యవర్తిని అంతా ఆశ్చర్యంతో చూశారు. నంబరు ౪౯ మళ్లా నోటుబుక్కు పైకితీసి, మధ్యవర్తిని పేరు చెప్పమన్నాడు.

"రాసుకో, చెపతా. మధుకరం, ప్లీడర్" అని అడ్రస్సుతోసహా సెలవిచ్చాడు.

"మీరుకూడా పదండి" అన్నాడు నంబరు ౪౯.

"ష్"

"డబ్బులు తీసుకోనీండీ... మరి నాబండి విషయం?" అన్నాడు నాగన్న, పోలీసు అతన్ని భుజంపట్టుకు లాక్కెడుతూంటే.

నాగన్నని ఆరాత్రి జైల్లో వుంచారు. మర్నాడు ఉదయం ప్లీడరు మధుకరం అతన్ని సమీపించి, జరిగిందంతా అసత్యం లేకుండా చెప్పమన్నాడు. నాగన్న అంతా చెప్పాడు.

"నాదగ్గర దాచి లాభంలేదు. 'నాకు జర్మనీ అంటే ఇష్టం' అని అన్నావా లేదా?"

"రామరామ!"

"ఛత్! నోరుముయ్! అన్నా నని ఒప్పుకో"

"అనం దే?"

న్యాయవాదిసహితం అని వుంటాడని నమ్ముతూంటే అతను కాదని యెల్లా అన గలడు? నాగన్న మొదట 'జర్మనీ' అన్న పేరు వో పెధవావిడదగ్గరనుంచి విన్నాడు. ఆవిడ యెప్పుడూ "జర్మనీ సిల్వర్ సామాన్లు వున్నాయా" అని అడిగేది. ఒకప్పుడు స్త్రీ లోకం కల్పించిన 'జర్మన్‌సిల్వర్' అన్నమాట యిప్పుడు నాగన్నపీకముందు వురితాడై కని పించింది. పైగా ప్లీడరు తను అని వుంటా డన్న వాక్యం అనకుండానే అన్నట్లు వొప్పు కోటంలో వుంది న్యాయమంతా. అతనికి మెల్లిగా న్యాయం బోధపడుతోంది. ఏ నేరం చెయ్యకపోవడం, కోర్టులో చేశానని వొప్పు కోవడం, చెయ్యలేదని న్యాయవాదులు వాదించడం, అతన్ని విముక్తుణ్ణిచెయ్యడం— యిదీ అతనికి బోధపడ్డ న్యాయం, అంచేత వొప్పుకున్నాడు.

ఆదినం నాగన్న కేసు విచారణ ఆరంభ మైంది. ౪౯-వ నంబరుపోలీసు జరిగిందంతా చెప్పి, నాగన్న తనని యెగతాళిచెయ్యడం కోసమే తుపాకీ చూపించాడనీ, మేరీతో "యుద్ధంరోజులు" అని అన్నా।డనీ నిదర్శ నాలుగా చెప్పాడు.

చివరికి నాగన్నని చెప్పమన్నారు.

"నువ్వు మేరీతో యెందుకన్నావ్?" అన్నాడు కిరీటంతరఫు న్యాయవాది.

"ఏమని?" అన్నాడు నాగన్న.

"అదే"

"అంటే?"

"నువ్వు యేది అనడంవల్ల యిక్కడికి కొచ్చావో అది"

"నే నిక్కడి కెందుకొచ్చానో యింత వరకూ నాకు తెలియదు. ప్రొద్దున్న మా మధుకరంగారు చెప్పినదాకా..."

అంతా మధుకరంకేసి చూశారు. మధుకరం నాగన్నకేసి చూసి "తప్పు. చెప్పద్దు" అన్నట్లుగా వేలు ఆడించాడు. నాగన్న మాట్లాడలేదు.

కిరీటంవైపుప్లీడరు మేజిస్ట్రేటు కేసి "చెప్పనా" అన్నట్లుగా చూశాడు. మేజి స్ట్రేటు తలపంకించాడు.

"నువ్వు 'నేను జర్మనీవాడను' అని అన్నావా లేదా?" అని బిగ్గరగా అడిగాడు.

"నేను, నేను జర్మనీవాడను అని అన్నాను. నేను..." అని నాగన్న తబ్బిబ్బుపడ్డాడు. అస లతని వుద్దేశం "జర్మనీవాడను అని అన లేదు" అని అనాలని. కోర్టువాతావరణంలో ద్రోహులు, దొంగలు — వీళ్ల చేతకూడా సత్యం చెప్పించే శక్తి వుంది.

అంతా బిగ్గరగా నవ్వారు. యథార్థం బైటపడింది. నేరం స్థిరపడింది. శిక్ష: అయిదు రూపాయలు జుల్మానా, తొమ్మిదిదినాలు జైలువాసం.

౨

నాగన్న తొమ్మిదిదినాలు తన సామాన్ల బండి యేమైందా అని ఆలోచించుకుంటూ గడిపాడు. ప్లీడరు మధుకరం చాలా జాలి గుండెకలవాడు. నాగన్నకి అయిదురూపా యలు ధర్మంచేశాడు, జుల్మానా యిచ్చుకో లేదని.

"ఐతే, నా సామాన్ల బండిగతి?"

"దానికేం, అది క్షేమంగా వుంటుంది"

"బాబూ, మీరు చేసిన మేలుకి దండాలు. కాని నేచేసిన నేరం యేంటండీ? 'జర్మనీ వాణ్ణి' అంటే తప్పేంటండీ?"

"ఓస్, నీకు తెలియనట్టు! ఏడిశావ్. ఇంకెప్పుడూ అల్లా అనకు. ఇదే నేరం మళ్లా చేస్తే నిర్ణయంలేకుండా శిక్షవిధిస్తారు."

ఇంకా నాగన్న సంశయం తీరలేదు. అతను చేసిన నేర మేమిటో యింతవరకూ బోధపడలేదు. కాని అతని దృష్టిలో న్యాయవాదులు చాలా మంచివాళ్లుగా తోచారు.

3

జైలువాసం పూర్తిచేసి నాగన్న మళ్లా తనబండి సామాన్లతో వీధులమ్మట కదలడం మొదలెట్టాడు. కాని అతను జైల్లో వున్న పదిరోజుల్లోనూ పరిస్థితులు మారిపోయాయి. అతనికి అమ్మకాలు తగ్గాయి. అతని సంపాదన రోజుకి అణాలోకి దిగింది. ఒక్కొక్క రోజున అదీ లేదు. లోకంలోని ధనమంతా యేమైందా అని నాగన్నకి పెద్ద అనుమానం బయలుదేరింది.

"పటకాలు, టోపీలు, పిల్లలసామాన్లు..." అని మళ్లా పాట సాగించాడు. ఈసారి పాటలో మాధుర్యం, లయ లేవు. టైపిస్టు జాన్ భార్య మేరీ గుమ్మంలో నిలబడింది.

"అమ్మగారూ, నా కివ్వాల్సిన అరణాలూ యిప్పిస్తారూ?" అన్నాడు నాగన్న దీనంగా.

"నీకు నేనేమీ యివ్వక్కర్లేదు. జైళ్లల్లో కాపరంవుండే దొంగచచ్చినాడికి అమ్మకం యేమిటి, పో!" అని తలుపు ఘడియేసింది.

అప్పటికి సాయంత్రం నాలుగైంది. వర్షం ప్రారంభించింది. నాగన్న పోతూంటే వీధివెంబడివారంతా అతనికేసి ఆశ్చర్యంగా చూడడం మొదలెట్టారు. అతడు దోషి, నేరస్థుడు, జైలుతో పరిచయం వున్నవాడు. ఇంకేం కావాలి జనానికి? వీధులో అంతకంటె కుతూహలమైన వ్యక్తి వుండబోడు. చిరిగిపోయిన చొక్కావ్యక్తి నాగన్నబండిలోంచి ఒకటోపీ తీసి నెత్తిమీద పెట్టుకుని "టర్ టర్" అని నడిచాడు. నాగన్న బ్రతుకు హేళనకింద మారిపోయింది. హేళన యెంతైనా భరించొచ్చు, అమ్మకాలుండి నాలుగు రాళ్లు గడించుకుంటే.

సాయంత్రం ఏడుగంటలు కావొస్తోంది. నాగన్న అణాకాసు చూసి వారంరోజులు కావొస్తోంది.

అతనికి జీవితంమీద విరక్తి పుట్టింది. స్వేచ్ఛమీద గురితప్పింది. అతను జైల్లో గడిపిన దినాలే హాయిగా వున్నాయి. సమయాని కింత అన్నం పెట్టేవాళ్లు. ఎవళ్లూ అతన్ని చూసి ఆక్షేపించలేదు. కాపలావాళ్లు అప్పుడప్పుడు అతన్ని చూసి తల పంకించి క్షేమం తెలుసుకుంటూ యెంతో పరిచయం చూపించేవాళ్లు. సర్వవిధాలా తన ఈ బ్రతుకుకంటె జైలుజీవనం వుత్తమమైంది. పైగా జైలుశిక్షపొందడంకటె యీలోకంలో అతనికి సులభమైన కార్యం వేరే కనిపించలేదు.

అదుగో ఎదురుగుండా రోడ్డుమధ్యలో నిలబడివున్నాడు ౩౬-వ నంబరుపోలీసు. నాగన్న అతని దగ్గరగా నడిచి—

"నేను జర్మనీవాడిని. ఏం చేస్తావో చెయ్యి" అన్నాడు.

౫౬-వ నంబరుపోలీసు మాట్లాడలేదు.

"నాబండిలోవి జర్మనీసామాన్లు, నేను జర్మనీవాడిని. కాబట్టి నన్ను జైల్లోపెట్టు. నాపేరు రాసుకో" అన్నాడు, మళ్లీ నాగన్న.

౫౬-వ నంబరుపోలీసు బిగ్గరగానవ్వాడు.

"చాల్లేరా వేషం. నీలాంటివాళ్లని నేను చాలామందిని చూశా. పో, అమ్మకో" అన్నాడు ౫౬-వ నంబరుపోలీసు.

ఈ పాడుప్రపంచంలో మనకి కోరుకున్నా అన్యాయం జరగదు.

